క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, తదితరులు

మానకొండూర్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో మానకొండూరు సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ మంగళవారం పరిశీలించారు. ధాన్యం రికార్డులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు న్నాయా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లు సజావుగా జరుగుతుండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య, సొసైటీ కార్యదర్శి లక్ష్మారెడ్డి, సిబ్బంది తదితరులున్నారు.

నైపుణ్యంతో ఉన్నతంగా ఎదగాలి

జమ్మికుంట: కంప్యూటర్ శిక్షణలో నైపుణ్యం పెంచుకొని ఉన్నతంగా ఎదగాలని ప్రిన్సిపల్ డా.బి.రమేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు నెలలుగా కంప్యూటర్ శిక్షణ పొందిన 65 మంది విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఓదెల్‌కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ రాజేంద్రం, కంప్యూటర్ విభాగం ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ ఉమాకిరణ్, అధ్యాపకులు ఉమాదేవి, శ్యామల, రాజుకుమార్, సుష్మ, రవిప్రకాశ్, ఎస్ రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్లు' కాంగ్రెస్ కార్యకర్తల పథకం



మాట్లాడుతున్న అనిల్, నాయకులు

శంకరపట్నం: ఇందిరమ్మ ఇళ్ల పథకం కాంగ్రెస్ కార్యకర్తల పథకమని బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆరోపించారు. మండలంలోని కేశవపట్నంలో మంగళవారం జిల్లా అధికార ప్రతినిధి సమ్మిరెడ్డితో కలిసి మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్ నాయకులు తయారు చేసిన జాబితానే గ్రామాల్లో అధికారులు సర్వే చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కరికి డబుల్ బెడ్‌రూం ఇవ్వలేదని, బీఆర్ఎస్ మోసం చేసిన తరహాలోనే కాంగ్రెస్ పేదలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. స్థానిక ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్లు మంజూరు చేశారని విమర్శించారు. అధికారులు నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయకుంటే కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు దొంగల రాములు, దండు కొంరయ్య, నరేందర్, శ్రీనివాస్, సారయ్య,రాజు తదితరలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

మానకొండూర్: మండలంలో సదాశివపల్లి, ఖాదర్‌గూడెం గ్రామాలలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని పశువైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు అరవింద్‌రెడ్డి, సుష్మిత సిబ్బంది రఫుల్లా, విజయలక్ష్మి, మమత, సంధ్య రాణి, కనకయ్య, పోచయ్య, రాజయ్య, కొమురమ్మ, మల్లయ్య వెంకటయ్య పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమి కేటాయించాలని వినతి



గన్నేరువరం: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను మండలంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మంగళవారం కలిశారు. సంఘం భవన నిర్మాణానికి భూమి కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేయగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి, సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

రక్తదానం

గన్నేరువరం: కరీంనగర్‌లోని ఓ వ్యక్తికి అత్యవసరంగా రక్తం అవసరం ఉండటంతో గన్నేరువరంకు చెందిన వివేకనంద యూత్ అధ్యక్షుడు గూడూరు సురేశ్ స్పందించాడు. మంగళవారం అపోలో రీచ్ ఆసుపత్రిలో రక్తదానం చేశాడు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. 14 ఏళ్లల్లో అనేక రక్తదాన శిబిరాలు కూడా నిర్వహించినట్టు తెలిపాడు.

సొంతింటి కల.. సాకారమయ్యేదెలా

- సుడా పరిధిలోని గ్రామాల్లో కట్టుకోవడానికి కఠిన నిబంధనలు
- అనుమతుల పేరిట అడ్డంకులు, గ్రామీణుల ఆర్థిక ఇబ్బందులు
- 2020 ఆగస్టు తర్వాత ఇళ్లకు నో పర్మిషన్
- ఇంటి నిర్మాణం కోసం వేచిచూస్తున్న గ్రామీణ కుటుంబీకులు



సొంతిల్లు కట్టుకోవడం అనేది చాలామంది జీవితంలో ఒక కల. ఇంటి నిర్మాణం కోసం చలానా కట్టడానికి సిద్ధంగా ఉన్నా ఇంటి పర్మిషన్ పేరిట నియమ నిబంధనలు కఠినంగా ఉండడంతో వేలాది మంది ఇంటి నిర్మాణం వాయిదా వేసుకుంటున్నారు. అయితే సుడా (శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పరిధి తిమ్మాపూర్, గన్నేరువరం, కరీంనగర్ రూరల్ మండలాల్లోని ప్రజలకు వారి కలను సాకారం చేసుకోవడం సవాల్‌గా మారింది. అనుమతికి సంక్లిష్ట నిబంధనలు, ఆర్థిక భారం, అవగాహన లేమి వల్ల గ్రామీణ ప్రజలు ఇంటి నిర్మాణంలో ఎన్నో అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. తిమ్మాపూర్ మండలంలో సుమారు 1,000 ఇళ్లు అనధికార నిర్మాణాలుగా గుర్తించడంతో విద్యుత్, నీటి కనెక్షన్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

తిమ్మాపూర్: సుడా పరిధి గ్రామాల్లో ఇల్లు నిర్మించే ముందు టీజీ బీపాస్ (తెలంగాణ స్టేట్ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ సిస్టమ్) ద్వారా అనుమతి తప్పనిసరి. మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసిన తర్వాత పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పరిశీలన చేసి అనుమతి ఇస్తారు. అయితే ఈ ప్రక్రియలో గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం. ఇంటి ప్లాన్‌కు సంబంధించిన ఫీజులు చెల్లించినా అనుమతి రాకపోతే చెల్లించిన డబ్బు తిరిగి రాకపోవచ్చు. ఈ అనిశ్చితి కారణంగా చాలా మంది అనుమతి లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. ఇది మరిన్ని సమస్యలకు దారితీస్తోంది.

అనధికార నిర్మాణం.. పరిణామాలు

అనధికార లే అవుట్‌లలో లేదా అనుమతి లేని స్థలాల్లో నిర్మించిన ఇళ్లు గ్రామ పంచాయతీ రికార్డులలో నమోదు కావు. దీంతో ఇంటికి నంబర్ లభించదు, ఫలితంగా విద్యుత్ మీటర్, నీటి కనెక్షన్ వంటి మౌలిక సౌకర్యాలు అందవు. కోర్టు వివాదాల్లో ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం వల్ల ఆస్తి యజమానులు చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటారు. గతంలో సర్పంచ్‌ల పాలనలో అధికారుల నోటిమాటలతో నిర్మాణాలు జరిగినప్పటికీ సుడా అధికారుల కఠిన నిబంధనలతో ఈ సమస్యలు తీవ్రమయ్యాయి. సుడా పరిధి గ్రామాల్లో ఇంటి నిర్మాణం గ్రామీణ ప్రజలకు సవాల్‌గా మారింది. అనుమతుల కోసం సంక్లిష్ట ప్రక్రియలు, ఆర్థిక భారం, అవగాహన లేమి వల్ల వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ప్రభుత్వం సరళమైన అనుమతి విధానాలు, అవగాహన కార్యక్రమాలతో సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. తద్వారా సొంతిల్లు అనే కల గ్రామీణ ప్రజలకు సులభం కాగలదు. ఇదిలా ఉంటే సర్పంచ్‌ల పరిపాలనలో నిర్మించినటువంటి ఇండ్లు ఉన్నాయి. అయితే వీటికి అనుమతి లభించాలంటే కష్టతరం అవుతుంది. ఇటువంటి ఇండ్ల విషయంలో సుడా పరిధిలో ఉన్నటువంటి గ్రామాలలో ఇటు కార్యదర్శులకు అటు ప్రత్యేక అధికారులకు తలనొప్పిగా మారింది. తమకున్న అధికారాలతో అనుమతి ఇవ్వలేక వాటిని రికార్డుల్లో నమోదు చేయలేక తర్జన భర్జన పడుతున్నారు. ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ రెగ్యులరైజేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఎన్నో రకాల పథకాలతో ఎల్ఆర్ఎస్‌లో భాగస్వామ్యం చేసే కార్యక్రమాలు చేస్తున్నారు. ఇలా అనుమతి లేకుండా కట్టుకున్న ఇళ్ల విషయంలో రెగ్యులరైజేషన్ చేసి ప్రజలకు వెసులుబాటు కలిగిస్తే బాగుంటుందని ప్రజలు భావిస్తున్నారు.

పట్టించుకునేవారు కరువు

2020 ఆగస్టు 30వ తేదీ ముందున్న డాక్యుమెంట్లకే ఇళ్ల పర్మిషన్లు ఇవ్వడం గడిచిన ఐదేళ్లలో స్థలాలు కొన్నవారు ఇంటి పర్మిషన్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.కోట్లల్లో ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుందని తెలిసిన ప్రభుత్వం తరఫున పట్టించుకునే వారు కరువయ్యారు. అర్హులకు ఇల్లు కట్టుకోవాలని జీవో జారీ అయితే సుడా పరిధిలో కొన్ని వేల ఇండ్ల నిర్మాణం మొదలయ్యే అవకాశం ఉంది. సుడా చైర్మన్‌తో పాటు అధికారులు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని గృహ నిర్మాణం చేపట్టేవారు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే అనుమతి

రాష్ట్ర ప్రభుత్వ సూచనలు, ఆదేశాల ప్రకారం ఇళ్ల నిర్మాణాలకు పరిమిషన్లు ఇస్తున్నాం. 2020 ఆగస్టు 30 ముందు డాక్యుమెంట్లకు ఎల్ఆర్ఎస్ ద్వారా ఇంటి పర్మిషన్‌కు అప్లై చేయడానికి అవకాశం ఉంది. తదుపరి ప్లాట్లు కొనుగోలు చేసిన వారు మరి కొన్ని రోజులు వేచి చూడాల్సిందే. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం జీవో విడుదల చేసేలా ప్రయత్నం చేస్తున్నాం.

– ఆంజనేయులు, సుడా ప్లానింగ్ అధికారి, కరీంనగర్

మానకొండూర్



మానకొండూర్: మండలంలోని దేవంపల్లి శివారులో డీబీఎం 6 పరిధిలోని 3 ఎల్ ఉప కాలువలో సిల్టు పేరుకుపోవడంతోపాటు కాలువను చెట్ల కొమ్మలు కమ్మేస్తున్నాయి. దీంతో కాలువ ఉంది అనేది తెలియడం లేదు. మరోవైపు సాగునీరు పారడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలోని సిల్టు, పిచ్చిమొక్కలను, కాలువకు ఇరువైపులా చెట్ల కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
వేణు, డీబీఎం 6 ఉపకాలువ డీఈ, సెల్ నంబర్ : 9908106623

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

'భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు

- మంత్రి పొన్నం ప్రభాకర్ ఎదుట గోడు వెల్లబోసుకున్న రైతులు



దరఖాస్తులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్న రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

చిగురుమామిడి: మండల కేంద్రంలోని శ్రీమహాలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఏళ్లుగా భూముల సమస్యలు పరిష్కారం కావడంలేదని పలువురు రైతులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎదుట ఆరోపించారు. చిన్నముల్కనూర్‌కు చెందిన ఓ రైతు పదేళ్లుగా తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానన్నాడు. ఇందుర్తిలో భూ సమస్యలు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని మాజీ జెడ్పీటీసీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె స్వామి అన్నారు. రేకొండలో భూ సమస్య పరిష్కారం కావడంలేదని సింగిల్‌విండో డైరెక్టర్ చాడ శ్రీధర్‌రెడ్డి అన్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టంతో సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు. చాలా మంది రైతులు మంత్రికి దరఖాస్తులు ఇచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ పోలీసులు దగ్గరికి వెళ్లనీయలేదు. అవగాహన సదస్సు వేదికపై నేరారోపణలు ఎదుర్కొంటున్న పోలీస్‌శాఖలో పనిచేసిన వ్యక్తి కూర్చోవడం చర్చనీయాంశమైంది. మంత్రి పొన్నం, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్, ఆర్డీవో, అధికారుల వెనుక వరుసలో కూర్చోవడంపై ఆయా రాజకీయ పార్టీల నాయకులు, రైతులు, యువకులు, ఇతరులు ఇదేందంటూ చర్చించుకున్నారు. కోర్టుల్లో పలు కేసులు పెండింగ్‌లో ఉండగా వేదికపై కూర్చోవడం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

గౌరవ వేతనం మంజూరు చేయాలని వినతి



నగరపాలక సంస్థ కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న ప్రైవేటు పీఈటీల సంఘం బాధ్యులు

కరీంనగర్‌స్పోర్ట్స్: వేసవి సెలవుల్లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో క్రీడాశిక్షణ శిబిరాలను నిర్వహించాలని, 2023లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పాల్గొని శిక్షణిచ్చిన కోచ్‌లకు గౌరవ వేతనం మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్‌కు జిల్లా ప్రైవేటు పీఈటీల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్నిచ్చారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 2017 సంవత్సరం నుంచి వేసవి సెలవుల్లో ఉచితంగా క్రీడాశిక్షణ శిబిరాలను నిర్వహిస్తూ వస్తున్నట్లు తెలిపారు. అప్పటి నుంచి మాతోపాటు చాలామంది ప్రైవేటు పీఈటీలు, కోచ్‌లు చిన్నారులకు శిక్షణనిస్తూ వస్తున్నారని, ఈ సంవత్సరం వేసవి సెలవులు ప్రారంభమైనా ఇంతవరకు నగరపాలక సంస్థ అధికారులు వేసవి క్రీడాశిక్షణ శిబిరాలపై ఎలాంటి ప్రకటన చేయలేదని పేర్కొన్నారు. కమిషనర్ స్పందిస్తూ.. మే నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. గౌరవం వేతనం కూడా ఇచ్చేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రైవేటు పీఈటీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌గౌడ్, గౌతమ్ రెడ్డి, కోశాధికారి అనూప్‌కుమార్, ముఖ్య సలహాదారు మహేందర్, ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్, మహిళా విభాగం కన్వీనర్ పుష్పలత, సంఘం బాధ్యులు రవి, శివ, అభిషేక్, అనూష్, శ్రీధర్, రాకేశ్‌రెడ్డి, చందు, మహేందర్ పాల్గొన్నారు.

సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలి

కరీంనగర్: ఉపాధిహామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్ వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు గతంలో ఇచ్చినట్లు వేసవిని దృష్టిలో ఉంచుకొని మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ప్రత్యేకంగా సమ్మర్ అలవెన్స్ చెల్లించాలని అన్నారు. కూలీలకు పని ప్రదేశాల్లో మంచినీరు, నీడ సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీతోపాటు రవాణా సౌకర్యం కల్పించి కొలతలు లేకుండా పని కల్పించాలన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

కరీంనగర్: మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీసీ సంఘం నాయకులు డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిగుర్ల శ్రీనివాస్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బకాయిలను చెల్లించకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని అన్నారు.

కాంగ్రెస్ నుంచి పురమల్లను సస్పెండ్ చేయాలి

కరీంనగర్ కార్పొరేషన్: పార్టీ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కార్యకర్తల ఆత్మవిశ్వాసం దెబ్బతినేలా వ్యవహరిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్‌ను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆర్‌టీఏ సభ్యుడు పడాల రాహుల్ డిమాండ్ చేశారు. పురుమల్ల వ్యవహారంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, జిల్లా నాయకులపై పురుమల్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు.ఇటీవల అదే రకంగా మాట్లాడారన్నారు. నష్టం కలిగేలా వ్యవహరిస్తున్న శ్రీనివాస్‌పై చర్య తీసుకోవాలని కోరారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరా బంద్

హుజూరాబాద్: హుజూరాబాద్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఏఈ ఎం. శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంతో పాటు బోర్నపల్లి, కొత్తపల్లి, తుమ్మనపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు పౌరహక్కుల దినోత్సవం

శంకరపట్నం: మండలంలోని గద్దపాక గ్రామంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తామని తహసీల్దార్ భాస్కర్ తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, అంబేడ్కర్ సంఘం, ప్రజాసంఘాల నాయకులు హాజరుకావాలని సూచించారు.

చలివేంద్రం ప్రారంభం



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో జనసేనా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పార్టీ సభ్యుడు రాకేశ్‌గౌడ్ ప్రారంభించారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రధాన రోడ్డు పక్కన చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, తిరుపతి, హరిక్రిష్ణ, హిసామోద్దీన్,అఖిలాష్, ప్రవీణ్, పర్శరాములు పాల్గొన్నారు.

అంబలి కేంద్రం..



శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో మంగళవారం అంబలికేంద్రాన్ని టీజేఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ముక్కెర రాజు ప్రారంభించారు. తెలంగాణ జనసమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కన్వీనర్ మోరె గణేశ్ అంబలికేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో ప్రభాకర్, రమేశ్, నాంపల్లి శంకర్, శ్యాం, శివప్రసాద్, తిరుపతి, శివసాయి, తదితరలు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

గంగాధర: మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు వారి ఆర్థికాభివృద్ధికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని మధురానగర్‌లో వివిధ గ్రామాలకు చెందిన 131 మంది లబ్ధిదారులకు మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మహిళల కోసం మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలు అమలు చేయడంతో పాటు మహిళల ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనుపమరావు, ఎంపీడీవో రాము, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్‌రావు, వైస్‌చైర్మన్ వేముల భాస్కర్, నాయకులు పురమల్ల మనోహర్, పడాల రాజన్న, సత్తు కనుకయ్య, కోల ప్రభాకర్, వేముల అంజి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కల్నల్‌కు సన్మానం

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ హైస్కూల్‌లో మంగళవారం కరీంనగర్ ఎన్‌సీసీ బెటాలియన్‌కు నూతనంగా నియమితులైన కల్నల్ అధికారి ఎ.కె.జయంతను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. వీఎన్ఆర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఎన్‌సీసీ దేశ భక్తిని పెంపొందిస్తుందని, సమాజ అభివృద్ధికి తోడ్పాటునందిస్తుందన్నారు. ఎన్‌సీసీ అధికారులు నిర్వహించే వివిధ కార్యక్రమాలకు చేయూతనందించి విజయవంతం చేస్తామని హామీ ఇచ్చారు. జయంత మాట్లాడుతూ.. అల్ఫోర్స్ పాఠశాలలో ఎన్‌సీసీకి సంబంధించిన ప్రణాళికల రూపకల్పన బాగుందని, వాటిని సకాలంలో అమలుపరుస్తున్న తీరు అభినందనీయని ప్రశంసించారు. పాఠశాల సిబ్బంది, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.



జయంతను సన్మానిస్తున్న డా.వి.నరేందర్‌రెడ్డి

జీనియస్ ఆఫ్ రికార్డు సాధించిన విద్యార్థి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మూడోతరగతి చదువుతున్న మందల వేదాన్షిత్‌రెడ్డి తన అద్భుత మేధాశక్తితో జీనియస్ ఆఫ్ రికార్డు సాధించాడు. కరీంనగర్‌లోని చేంజ్ మెమోరీ అకాడమీలో మంగళవారం ఆన్‌లైన్ ద్వారా జరిగిన కార్యక్రమంలో ప్రపంచ రికార్డు సొంతం చేసుకున్నాడు. మల్టీ టాలెంటెడ్ చైల్డ్ ప్రాడిజీగా గుర్తింపు పొందడమే కాకుండా నేషనల్ సూపర్ మెమరీ చాంప్ అవార్డు కైవసం చేసుకున్నాడు. కంప్యూటర్ కోడింగ్ అయిన బైనరీ డిజిట్స్ 10011 సిరీస్‌ను 100 సంఖ్య గల నంబర్లను ఒకసారి చూసి పూర్తిగా జ్ఞాపకం ఉంచుకొని ప్రదర్శించాడు. శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి వికటకవి తెనాలి రామకృష్ణుడు సృష్టించిన తోక మేక మేక తోక అనే టంగ్ ట్విస్టర్ పదజాలాన్ని 100 సార్లు చెప్పినప్పుడు వాటిని రాయడానికి 15 నిమిషాలు పడితే.. తను కేవలం 100 సెకన్లలోనే గుర్తుంచుకొని ప్రపంచ రికార్డు సాధించాడు. భారత రాజ్యాంగం, జీకే, స్టేట్స్ క్యాపిటల్స్‌తోపాటు భగవద్గీత, ఇతర శ్లోకాలు సైతం చెప్పి అందరినీ అబ్బురపరిచాడు. తన టాలెంట్‌ను గుర్తించిన చేంజ్ మెమరీ అకాడమీ డైరెక్టర్, ప్రముఖ మెమరీ ట్రైనర్ డా.వేణుకుమార్ ఈ బాలుడికి శిక్షణ ఇచ్చారు. చిన్న వయస్సులోనే వేదాన్షిత్‌రెడ్డి ప్రపంచ రికార్డు సాధించడంపై తల్లిదండ్రులు నాగలక్ష్మి, కార్తీక్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. అలయన్స్ క్లబ్ గవర్నర్ పోలు సత్యనారాయణ, సౌత్ మల్టిఫుల్ వైస్ చైర్మన్ మోర అంజయ్య, ప్రిన్సిపాల్ శ్రీవిద్య, ట్రైనర్స్ తిరుపతి, అశోక్ సామ్రాట్, సదానందం పాల్గొన్నారు.



అవార్డు అందిస్తున్న వేణుకుమార్

తీవ్రవాదాన్ని అరికట్టండి

కరీంనగర్/విద్యానగర్(కరీంనగర్): పాకిస్తాన్ తీవ్రవాదాన్ని అరికట్టాలని, మావోయిస్టులతో చర్చలు జరపాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ప్రజామిత్ర కార్యాలయంలో మాట్లాడారు. పహల్గాం తీవ్రవాదు దాడని ఖండించారు. పాకిస్తాన్ రాజకీయాలు మొత్తం భారతదేశానికి వ్యతిరేకమని అన్నారు. ఆపరేషన్ కగార్‌ను ఆపాలని పలు రాజకీయ పార్టీలు ఆలస్యంగానైనా కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయన్నారు. కొంపెల్లి రవీందర్, శ్రీరాముల కిషన్, బైరం రాజేందర్, గాజం నరేందర్, నాగరాజు, అమృతరావు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు నోచుకోక నిత్యం తంటాలు



చిగురుమామిడి: మండల కేంద్రంలో రెండు వాహనాలు పక్కపక్కన వెళ్లలేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ఇరుకు రోడ్డును ఎప్పుడు విస్తరణ చేస్తారని పలువురు వాహనదారులు వాపోతున్నారు.